షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152



1St Year
Happy Work Anniversary.
Good for Health
Best for Readers



సంపుటి : 2 సంచిక : 361 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 31 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 361 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 31 December 2025 PAGES : 8 PRICE : 3/-


## అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన మమతాబెనర్జీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 30)

బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ



ఉంటే పహల్గాం, ఢిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు.బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్‌ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేపట్టాల్సిన -మిగతా 2లో

## శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు పవన్ శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు.

కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ శ్రీకారం చుట్టారు. ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది.

# కొత్త జిల్లాలు పోలవరం, మార్కాపురం

## అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె



26 నుంచి 28కి పెరిగిన జిల్లాల సంఖ్య
తిరుపతి జిల్లాలోకి రైల్వేకోడూరు, వైఎస్సార్ కడపలోకి రాజంపేట
అన్నమయ్య జిల్లాలోనే రాయచోటి నియోజకవర్గం
కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం
పలు రెవెన్యూ డివిజన్లలో మార్పులు, చేర్పులు
మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర
31న తుది నోటిఫికేషన్.. జనవరి 1 నుంచి పాలన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)

సచివాలయంలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, ఉన్నతాధికారులు కొత్తగా పోలవరం, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తూనే.. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం ఈ జిల్లాలో ఉన్న రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్ కడప జిల్లాలోకి, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని నిర్ణయించింది. రాయచోటి నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలోనే ఉంటుంది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం.. జిల్లాల పునర్విభజనపై విస్తృతంగా చర్చించి అమోదం తెలిపింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతోపాటు.. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని -మిగతా 2లో

## అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది: మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడంపై హర్షం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)

అద్దంకి, కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను మన్నిస్తూ, ఆ ప్రాంతాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషదాయకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజనను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.
యువగళం పాదయాత్ర సమయంలో -మిగతా 2లో

## గతేడాది కంటే అదనంగా 8 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)

గతేడాది కంటే ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 34.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '5.59 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,206 కోట్లు చెల్లించాం. రైతులు నష్టపోకుండా మద్దతుధర అందించాం. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో అనేకమంది పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.50 వేల కోట్లు పింఛన్ల కింద ప్రజలకు అందజేశాం. గత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేయగా.. ప్రస్తుతం పెద్దఎత్తున రోడ్లు నిర్మిస్తున్నాం. ఇందుకోసం తాజాగా రూ.2,500 కోట్లు కేటాయించాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టి, పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. డేటా లేక్ ద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు -మిగతా 2లో

## కొత్త ఏడాదిలో నూతనోత్సాహంతో పనిచేద్దాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)

వచ్చే ఏడాదిలో మరింత ఉత్సాహంతో స్వర్ణాంధ్ర సాధనకు పని చేద్దామని ఉద్యోగులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యమిస్తుందని, సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధిలో మీరంతా ముఖ్య భూమిక పోషించాలని



పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లపై పూర్తి అవగాహన, స్పష్టమైన దృష్టి ఉన్నాయని, దశల వారీగా అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూనే ఉద్యోగుల హక్కులు కాపాడేలా నిర్ణయాలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు.

రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఏపీ ఎన్జీవో, ఏపీ ఐకాస, ఉపాధ్యాయ సంఘాల నాయకులు -మిగతా 2లో

## 2 నుంచి 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 30)



వచ్చే నెల 2 నుంచి 9 లోపు రాష్ట్రవ్యాప్తంగా 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ రాజముద్రతో కొత్తగా ముద్రించిన వీటి పంపిణీకి ఏర్పాట్లు చేశామని సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. "గత పాలకుడు తన ఫొటోను రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై ముద్రించారు. సర్వే రాళ్లను సైతం వదల్లేదు. పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న పాస్ పుస్తకాల్లో తప్పులేమైనా దొర్లితే వెంటనే సరి చేయాలని అధికారులను ఆదేశించాం. గ్రేటర్ విజయవాడ, తిరుపతి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో వాటిని మహా నగరాలుగా అభివృద్ధి చేయనున్నాం" అని సత్యప్రసాద్ వివరించారు.

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం..

## శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం



ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు
రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం
గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 30)

దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర - ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం.ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. -మిగతా 2లో

## ఎరువులకు బదులు నానో యూరియా, నానో డి ఏ పి వాడాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 30)

మండలంలోని ముప్పాళ్ళ, సింగర్ బొట్లపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రాము మాట్లాడుతూ రబీ సీజన్ అనగా అక్టోబరు నుండి వేసిన పంటలన్నిటికీ తప్పనిసరిగా ప్రతి రైతు సంబంధిత రైతు కేంద్రాలలో వేసిన పంటలను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో అన్ని రకాల ఎరువులను పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువులకు బదులు నానో యూరియా, నానో డీఏపీలను వాడాలని రైతులకు సూచించారు. పొగాకు రైతులు ఎవరు నల్లబెల్లి పొగాకు సాగు చేయకూడదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి రాజేష్ కుమార్ రెడ్డి, కే చంద్రిక పంచాయతీ కార్యదర్శి కే గీత, తేజస్విని, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## షణ్ముఖ వెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 30)

మార్కాపురం పట్టణంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు నివాసంలో మంగళవారం షణ్ముఖ వెలుగు దినపత్రిక యర్రగొండపాలెం నియోజకవర్గ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయి నాయకులు, షణ్ముఖ వెలుగు దినపత్రిక మార్కాపురం ఇన్‌ఛార్జి గుమ్మ అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు దొండపాటి వెంగల్‌రెడ్డికి పితృవియోగం నివాళులర్పించిన ఎమ్మెల్యే కందుల



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 30)

మండలంలోని కారుమనుపల్లె గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు దొండపాటి వెంగళరెడ్డి తండ్రి దొండపాటి చిన్నసుబ్బారెడ్డి ముక్కోటి మంగళవారం ఏకాదశి రోజు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న మార్కాపురం నియోజక వర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వారి స్వగ్రామానికి వెళ్ళి మృతుడు చిన్న సుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పించడం జరిగింది. మృతుడికి భార్య నారమ్మ, వారి కుమారులు వెంగళరెడ్డి, కృష్ణారెడ్డి, కుమార్తె వెంకటసుబ్బమ్మలందరినీ పరామర్శించి వారందరిని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొండపాటి మోహన్‌రెడ్డి, గొలమారి శ్రీనివాసులరెడ్డి, దొండపాటి కాశిరెడ్డి, దొండపాటి లక్ష్మీనారాయణరెడ్డి, దొండపాటి రామిరెడ్డి, దొండపాటి కృష్ణారెడ్డి, చలమారెడ్డి, హనుమంతరెడ్డి, వీరాంజనేయరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మొదటిపేజీ తరువాయి

## కొత్త జిల్లాలు పోలవరం, మార్కాపురం

రెండుగా విభజించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మార్చనున్నారు. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలో కలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి కందుకూరు, బాపట్ల జిల్లా నుంచి అద్దంకి నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలో కలవనున్నాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలతోపాటు పలుచోట్ల మార్పులు, చేర్పులపై ఈ నెల 31న తుది నోటిఫికేషన్ జారీ కానుంది. జనవరి 1 నుంచి పాలన ప్రారంభం అవుతుంది. మొత్తంగా రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 26 నుంచి 28కి పెరిగింది. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోకి.. మూడు మండలాలతో గూడూరు రెవెన్యూ డివిజన్..ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని గూడూరు రెవెన్యూ డివిజన్‌లో మార్పులు, చేర్పులు చేశారు. గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో కూడిన గూడూరు రెవెన్యూ డివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలుపుతున్నారు. ఈ డివిజన్‌లో మిగిలే మండలాల్లో.. వాకాడు, చిట్టమూరును సూళ్లూరుపేట డివిజన్‌లో, బాలాయపల్లె, డక్కిలి, వెంకటగిరి మండలాల్ని శ్రీకాళహస్తి డివిజన్‌లో కలుపుతారు. కలువాయి మండలం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో, రాపూరు, సైదాపురం మండలాలు నెల్లూరు డివిజన్‌లోనే కొనసాగించనున్నారు. రెవెన్యూ డివిజన్లలో మార్పులు, చేర్పులివే అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో కలుపుతారు. కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోని కొండాపురం, వరికుంటపాడు మండలాల్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో మిగిలే 5 మండలాల్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తారు. శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజన్‌లోని నందిగాం గ్రామాన్ని టెక్కలి డివిజన్‌లో కలుపుతారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేయనున్నారు. చీడికాడ మండలాన్ని నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ నుంచి అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించనున్నారు. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు డివిజన్‌లో చేర్చనున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి చేరుస్తారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లోకి తెస్తారు. ఆమడగూరు మండలాన్ని కదిరి డివిజన్ నుంచి పుట్టపర్తి డివిజన్‌లోకి, గోరంట్ల మండలాన్ని పుట్టపర్తి డివిజన్ నుంచి పెనుకొండ డివిజన్‌లోకి కలుపుతారు.

## అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన మమతాబెనర్జీ

అవసరం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని మమత ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక ఎందరో బీఎల్‌వోలు, అధికారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా ఓటర్ల జాబితాలో 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో రాష్ట్రంలోని ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.

## అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది: మంత్రి గొట్టిపాటి రవికుమార్

నారా లోకేశ్ ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ, కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ప్రకాశం జిల్లాలో తిరిగి విలీనం చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా 2012 నుంచి అద్దంకి ప్రాంత ప్రజలు తమ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం, పాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారని, వారి విజ్ఞప్తిని మన్నించి అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లు బాపట్ల జిల్లా పరిధిలో ఉండటం వల్ల అద్దంకి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ కష్టాలు తీరనున్నాయని వివరించారు.

### దుర్గగుడిలో అంతరాయంపై వివరణ

ఇటీవల విజయవాడ కనకదుర్గ ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై మంత్రి స్పష్టత ఇచ్చారు. ఇది కేవలం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా జరిగిన ఘటన అని, విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేశారు. కరెంట్ కేవలం 10 నిమిషాలు మాత్రమే నిలిచిపోయిందని, విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈవో, ఇతర ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన అంశాలపై అనవసర రాద్ధాంతం చేయడం, ప్రతి సాధారణ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని మంత్రి మండిపడ్డారు. ఏ ధర్మాన్నైనా, సంప్రదాయాలనైనా చిత్తశుద్ధితో కాపాడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు.

## గతేడాది కంటే అదనంగా 8 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది' అని మనోహర్ వివరించారు.

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం..

### శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## కొత్త ఏడాదిలో నూతనోత్సాహంతో పనిచేద్దాం

సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎన్జీవో, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా), ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్), తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం, రెవెన్యూ, ఆర్టీసీ ఈయూ, కోఆపరేటివ్, ప్రధానోపాధ్యాయులు, కార్మిక అధికారులు, పీఆర్ ఇంజినీర్లు.. తదితర సంఘాల డైరీలు, క్యాలెండర్లను సీఎం ఆవిష్కరించారు. ఉద్యోగినుల చైల్డ్ కేర్ లీవ్‌కు సంబంధించిన వయోపరిమితిని తొలగించినందుకు ఏపీఎన్జీవో, ఏపీ ఐకాస అమరావతి నేతలు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల హామీపై వెంటనే ఉత్తర్వులు ఇచ్చినందుకు ఆర్టీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘాల నేతలు విద్యాసాగర్, బొప్పరాజు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, భూపతిరాజు రవీంద్రరాజు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీర పాండ్యన్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 30)



ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీర పాండ్యన్ తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ అన్నారు. దాదాపు రెండు గంటలకు పైగానే ఆ పిహెచ్‌సి లోనే తనిఖీలు నిర్వహించారు. ఓపి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్, యాప్ పని తీరు అడిగి తెలుసుకున్నారు. తదుపరి డాక్టర్ వద్ద రోగులు పొందుతున్న వైద్యం, రక్త నమూనాలు, ల్యాబ్ లో రక్త పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అక్కడికి వచ్చే రోగులకు ఏ.ఎన్.ఎం.లు అందిస్తున్న సేవలు, ఔషధాల పంపిణీ, వైద్య పరీక్షలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. "డి చంద్రమోహన్" అనే వ్యక్తి వైద్య పరీక్షలకు రాగా అతని పేరు రిజిస్ట్రేషన్ ప్రారంభం నుంచి వైద్యం ముగిసే వరకు ఆయన పక్కనే ఉండి వైద్యం ఎలా అందుతుందని నిశితంగా పరిశీలించారు. వైద్య ఆరోగ్యశాఖలో అమలయ్యే వివిధ యాప్‌ల పనితీరు పై ఆరా తీశారు. రోగులకు అవసరమైన ఔషధాలను వైద్య అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని రాష్ట్ర కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలో 214 రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. రోగులకు ఔషధాల పంపిణీ, నిల్వలను ఆయన పరిశీలించారు. కుష్టి రోగులకు పంపిణీ చేస్తున్న ఔషధాల దస్త్రాన్ని పరిశీలించారు. ఔషధాల గడువు తేదీలు, నిల్వలపై ఆరా తీశారు. పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆన్ లైన్ లో వేస్తున్న ఎఫ్ ఆర్ ఎస్ హాజరును పరిశీలించారు. ఒక్కొక్కరిని పిలిచి వారి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలోని వివిధ విభాగాలకు చెందిన అన్ని దస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఎం ఏడుకొండలురెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కె ఏడుకొండల రెడ్డిలతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుంది, వైద్య అధికారులు సక్రమంగా చూస్తున్నారా, సక్రమంగా జవాబు చెబుతున్నారా, మందులు సక్రమంగా ఇస్తున్నారా, ఎవరైనా లంచాలు అడుగుతున్నారా అంటూ రోగులకు పలు ప్రశ్నలు వేసి అభిప్రాయాలను సేకరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించేలా వైద్య అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, వైద్య అధికారులు, తదితరులు ఉన్నారు.









షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 31.12.25 బుధవారం



## జిల్లాల పునర్విభజన ప్రతిపాదలకు ఆమోదం
## మార్కాపురం జిల్లా ఏర్పాటు

**ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబ్ నేట్లో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ జిఓ ఎంఎస్. నెం.524ను (తరువాయి 4లో...)

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# వెలుగు దిన పత్రిక మరింత వెలుగొందాలి

**అనతి కాలంలోనే ప్రజల మన్ననలు చూరగొంది**
**క్యాలెండర్ ఆవిష్కరణలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**












**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 30)**

వెలుగు దినపత్రిక మరింత వెలుగొందాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పొదిలి పట్టణంలోని అరకు కాఫీ షాప్ వద్ద షణ్ముఖ వెలుగు దినపత్రిక 2026 నూతన సంవత్సర మార్కాపురం నియోజకవర్గ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ముందుగా షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ ఓబులశెట్టి రాధాకృష్ణ ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి ఆయన అందరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 28 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కల్గిన రాధాకృష్ణ సొంతంగా దినపత్రికను ప్రారంభించి అనతి కాలంలోనే అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల మన్ననలు అందుకున్నాడన్నారు. రాబోయే రోజుల్లో మరింత నాణ్యమైన వార్తలను ప్రచురిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు వారధిగా నిలవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. దినపత్రికను ప్రారంభించిన రెండేళ్ళలోనే జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మరి కొద్ది రోజుల్లోనే రాష్ట్ర స్థాయిలో కూడా మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడే మార్కాపురం జిల్లాలో కూడా సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొదిలి సిఐ రాజేష్ కుమార్, మార్కాపురం ఎవంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, ఏఎంసి డైరక్టర్లు రోళ్ళ శ్రీను, సోమిశెట్టి శ్రీదేవి, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మండల తెలుగుయువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, పట్టణ తెలుగు యువత అద్యక్షులు షేక్ కాలేషా, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, తానికొండ వెంకట్రావు, కొనకనమిట్ల మండల పార్టీ అద్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సమన్వయ లోపంతో దుర్గ గుడిలో విద్యుత్ అంతరాయం

**తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు**
**భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీఠ**
**దుర్గగుడి ఘటనపై రాజకీయ విమర్శలు దురదృష్టకరం**
**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**



**(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, డిసెంబర్ 30)**

విజయవాడలోని దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో సుమారు 15 నిమిషాల పాటు విద్యుత్ అంతరాయం కలగడానికి గల కారణాలపై దేవాదాయ, విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ అంతరాయం విషయం తన దృష్టికి రాగానే యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిచామని వెల్లడించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే దుర్గ గుడిలో కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యుల మీద చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. (తరువాయి 4లో...)

## జగన్ ది రాక్షస మనస్తత్వం

**పుట్టిన రోజు పేరుతో మూగజీవాలను బలిచ్చి,**
**రక్తాభిషేకం చేస్తుంటే గమ్మునున్నారు**
**మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కి**
**కార్యకర్తల ఆగడాలను ఖండించే బాధ్యత లేదా**
**పిపిపి విధానంతోనే వైద్య విద్య అభివృద్ధి**
**గత ప్రభుత్వ హయాం కాలంలో మైనింగ్ ను దోచుకున్నారు**
**రాష్ట్ర మైనింగ్ శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)**

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ది రాక్షస మనస్తత్వమని రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. తన బంధువుల ఇంటికి మంగళవారం ఒంగోలు విచ్చేసిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం (తరువాయి 4లో...)

## కూటమి పాలనలోనే అభివృద్ధి

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర**



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 30)**

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుందని కనిగిరి ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే ఎకో పార్క్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు 2026 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. మెగా డిఎస్సీతో పాటు కానిస్టేబుల్ నియామకాలతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గత పదేళ్ళలో కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి నామమాత్రంగానే జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన 18 నెలల కాలంలో రైల్వే లైను పనులు వేగవంతంగా జరపడంతో కనిగిరి వరకు రైలు వచ్చిందన్నారు. నిమ్జ్, ఎంఎస్‌ఎంఈ పార్కు, బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో కనిగిరిలో ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు భూముల విలువ పెరిగిందన్నారు. గత ఐదేళ్ళలో హైవే రోడ్డు నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదన్నారు. కానీ ఇప్పుడు హైవే నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఓవి రోడ్డు పనులతో పాటు ట్రిపుల్ ఐటి నిర్మాణం జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారెస్టు ఎకో పార్కును పర్యాటకంగా మారుస్తామన్నారు. అభివృద్ధి చేయడం (తరువాయి 4లో...)

## నేరాల నియంత్రణ, శాంతి భద్రల పరిక్షణలో పోలీసులు విశేష కృషి

**వార్షిక నివేదకలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)**




నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు విశేష కృషి చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. 2025 పోలీసు వార్షిక నేర నివేదకను ఆయన మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 పలు సంచలనాత్మక కేసులు చేధించామన్నారు. కీలక కేసుల్లో నిందితులకు జీవిత, మరణించే వరకు శిక్షలు పడేలా చేశారన్నారు. అన్ని రకాల నేరాలకు సంబంధించి 2024లో 8371 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 7818కు పరిమితమైందన్నారు. 6.61 శాతం మేర నేరాలు తగ్గాయన్నారు. విచారణలో ఉన్న కేసులు 2024లో 11705 కేసులు ఉండగా, 2025లో 13018 కేసులో 7897 కేసులను డిస్పోజల్ చేయగా 6% కేసులు తగ్గించటం జరిగిందన్నారు. 2025లో బాడిలీ అఫెన్సు కేసులు 1122, ఆస్తి సంభందిత నేరాలు 632, మహిళా సంభందిత నేరాలు 709, రహదారి ప్రమాదాలు 757, సైబర్ నేరాలు 44 నమోదు కాగా 2024 సంవత్సరంలో నమోదు అయిన కేసుల కంటే తక్కువ కేసులు అవటం విశేషమన్నారు. 2024తో పోలిస్తే 2025 సంవత్సరంలో క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ 17.08% తగ్గుదల జరిగిందన్నారు. 20 సంవత్సరాలు శిక్ష పడిన కేసులు 3, జీవిత ఖైదు శిక్ష పడిన కేసులు 3, 10 సంవత్సరాలు శిక్ష పడిన కేసులు 2, 10 సంవత్సరాల లోపు శిక్ష పడిన కేసులు 8, 2025 సంవత్సరంలో మొత్తం 425 శిక్షలు విధించబడ్డాయన్నారు. అవగహన కార్యక్రమాలు, పల్లెనిద్ర, కేసులపై ప్రత్యేక మానిటరింగ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా చేయటం తగ్గాయన్నారు. 2025లో 632 చోరీ కేసుల్లో (తరువాయి 4లో...)

# సమన్వయ లోపంతో దుర్గ గుడిలో విద్యుత్ అంతరాయం

భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి గొట్టిపాటి ఉద్ఘాటించారు. జనవరి 6,7 తేదీలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి దుర్గ గుడి ఈవో, ముఖ్య అధికారులతో కలిసి సమావేశం కానున్నట్లు మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. సమన్వయ లోపం వల్ల జరిగిన ఈ చిన్న పొరపాటును పట్టుకొని రాజకీయ విమర్శలు చేయడం తగదని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. ప్రతీ చిన్న విషయాన్ని కూడా రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. సనాతన ధర్మానికి మాత్రమే కాకుండా ఏ ధర్మానికైనా.. కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం ఎంతో సంతోషదాయకమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ.. జిల్లాల పునర్విభజన జరిగిందన్నారు. పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపినట్లు పేర్కొన్నారు. 2012 నుంచి అద్దంకి రెవెన్యూ డివిజన్ కోసం పోరాడుతుండగా కూటమి ప్రభుత్వంలో సాకారమైనట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. అద్దంకిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తో పాటు మంత్రి వర్గ ఉపసంఘానికి మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాల పునర్విభజన ప్రతిపాదలకు ఆమోదం మార్కాపురం జిల్లా ఏర్పాటు

జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లుగా 21 మండలాలతో ఈ నెల 31వ తేదీ నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానున్నట్లు ఆయన తెలిపారు. మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డు గల రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కాలనీలో గల భవనంలో ఈ నెల 31వ తేదీ నుండి మార్కాపురం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని పరిపాలనా వ్యవహారాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారి చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# కూటమి పాలనలోనే అభివృద్ధి

చేతగాని పాలకులను ఎన్నుకోవడంతో కనిగిరి అభివృద్ధి 10 ఏళ్ళు వెనక్కు పోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. నూతన సంవత్సర వేడుకలను ఎకో పార్కు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, టిడిపి నాయకులు షరీఫ్, అచ్చాల రవి, కొబ్బరిబోండాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ది రాక్షస మనస్తత్వం



సందర్భంగా వైసిపి కార్యకర్తలు మూగజీవాలను బలిచ్చి, జగన్ చిత్రపటాలకు రక్తాభిషేకం చేస్తుంటే, మరోపక్క జగన్ రాక్షస ఆనందాన్ని పొందుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు కార్యకర్తల ఆగడాలను అడ్డుకునే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష మేరకు కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యాయి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తున్నాయి, ముఖ్యమంత్రి మూడు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. పిపిపి విధానంతో వైద్య కళాశాలను ఏర్పాటు చేయటం మంచి పరిణామం అన్నారు. ఈ విధానాన్ని ఈపాటికి దేశం మొత్తం అవలంబిస్తుందన్నారు. పేద విద్యార్థులు వైద్య సీట్లు పొందుతారు అన్నారు. అలాగే పేదలకు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. పిపిపి విధానాన్ని జగన్ రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హాయం కాలంలో మైనింగ్ ను తన హస్తగతం చేసుకొనేందుకు ప్రయత్నించిందన్నారు. మైన్ అధినేతలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. వారిని బెదిరించారన్నారు. వేల కోట్లు జరిమానాలు విధించారు అన్నారు. అందిన కాడికి దోచుకున్నారు అన్నారు. కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది అన్నారు. మైనింగ్ ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లను రాష్ట్రంలోని ఏర్పాటు చేస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయనతోపాటు ఈదర మోహన్, వెంకటరామయ్య, ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

# నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిక్షణలో పోలీసులు విశేష కృషి

సుమారు మొత్తం రూ.8.70 కోట్లు రూపాయలు చోరికాగా రూ.4.44 కోట్లు రికవరీ చేశామన్నారు. ప్రాపర్టీ నేరాల్లో 51.02% రికవరీ పెరిగిందన్నారు. ఫింగర్ ప్రింట్స్ 35, సీసీటీవీ ఫుటేజ్ 37, సాంకేతిక పరిజ్ఞానం 32 కేసులు కనుక్కోవటం జరిగిందన్నారు. నైట్ బీట్స్, విజిబుల్ పోలీసింగ్, సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచటం ద్వారా గణనీయంగా నేరాలు తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాద మరణాల వార్షిక రేటు గతంతో పోల్చితో 13.29%కి తగ్గుదల, రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతంగా అవగాహన, మరణాల రేటు 12.05% తగ్గించటం జరిగిందని తెలిపారు. ఇది ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అవగాహన కార్యక్రమాల ఫలితమన్నారు. స్టాప్ వాష్ అండ్ వాష్ ప్రోగ్రాం, బ్లాక్ స్పాట్ లో సోలార్ మార్చటం, డ్రోన్ తో నిఘా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం ద్వారా నేరాలు తగ్గాయని పేర్కొన్నారు. ఈ చాలాన ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన పై రూ.2.02 కోట్ల చలానా వసూలు చేయబడిందన్నారు. ఈ సంవత్సరం 89% చలాన్ల వసూళ్లను సాధించి, సమర్థవంతమైన పనితీరుకు గాను హైకోర్టు నుండి ప్రశంసలు అందుకున్నామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 2025 లో 5808 కేసులు నమోదు చేయగా 3363 మంది శిక్షలు, జరిమానా కోర్ట్ వారు విధించారన్నారు. 2025లో మిస్సింగ్ బాలికలు 136 నమోదు కాగా వాటిలో 129 మంది బాలికలను 94.85% గుర్తించటం, 2025లో 292 మిస్సింగ్ మహిళా కేసులు నమోదు కాగా వాటిలో 264 మంది మహిళలను 90.41% గుర్తించటం, మిస్సింగ్ కేసులపై అధిక దృష్టి సారించి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఉత్తమ ప్రయత్నాల ఫలితంగా మిస్సింగ్ కేసులు ఛేధించడం జరిగిందన్నారు. 2025 లో మొబైల్స్ మిస్సింగ్ 3877 ఫిర్యాదులకు వెంటనే స్వీకరించి, 2167 మొబైల్స్ గుర్తించి భాదితులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. జాతీయ సైబర్



నేరాల నివేదిక పోర్టల్‌లోని ఫిర్యాదులు 2025 సైబర్ నేరాల నమోదులో 4% తగ్గుదల ఉందన్నారు. విస్తృత అవగాహన ప్రచారాల సానుకూల ఫలితాన్ని లభించాయి. బహిరంగ మద్యపానం, ప్రజా ఇబ్బందులకు వ్యతిరేకంగా ఈ సంవత్సరం 20,031 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. సమర్థవంతమైన చర్యలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో 1,025 మద్యపాన ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం జరిగిందన్నారు. జిల్లాలో రౌడీ షీటర్స్ 1214 మంది ఉండగా వారిలో 173 చురుగా ఉన్నారని, 962 మందిని బైండ్ ఓవర్ చేయటం జరిగిందని, మరికొంత మందిపై పిడి యాక్ట్, బహిష్కరణ చేయటం కూడా జరుగుతుందన్నారు. 2025లో ఎంఎస్‌సిడి ద్వారా 65,576 మందిని చెక్ చేయగా 190 మంది పాత ముద్దాయిలను గుర్తించటం జరిగిందన్నారు. జిల్లాలో 32 డ్రోన్ కెమెరాలు ఉండగా జిల్లా వ్యాప్తంగా 6474 ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాలు 502, మ్యాట్రిక్స్ కెమెరాలు 5737, (ప్రైవేట్ కెమెరాలు) వెరసి 6239 కెమెరాలు నేరాలు నియంత్రణకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. తుఫాన్ దృష్ట్యా భారీ వర్షాలు కురిసి చెరువులు, వాగులు నదులు పొంగి పొర్లడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా పోలీస్ అధికారులు అప్రమత్తం చేయటం మరియు ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించామన్నారు. కొండపి పరిధిలోని చోడవరం వద్ద మూసీ వాగు వరదల్లో చిక్కుకున్న 121 మంది వలస కూలీలను రక్షించటం జరిగిందన్నారు. డయల్ 112 కు 18426 కాల్స్ చేయగా సిబ్బంది వెంటనే స్పందించి, వెనువెంటనే సహాయం అందేలా కృషి చేశామన్నారు. పలు రకాల సమస్యలతో ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తులను రక్షించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంతో సామాన్య ప్రజలకు చేరువై, పరిష్కారం కానీ సమస్యలను వెంటనే పరిష్కరించి ముఖ్యంగా వృద్ధులకు అండగా నిలిచామన్నారు. నేర నివారణ చర్యలను బలోపేతం చేయడానికి 3891 మంది వలస కార్మికుల వివరాలను సేకరించటం జరిగిందని తెలిపారు. 2026 లో కూడా ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేసిన ఫలితంగానే ఈ సంవత్సరంలో నేరాల రేటు గణనీయంగా తగ్గింది. ప్రజల సహకారం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సమర్థవంతమైన పోలీసింగ్ విధానాలతో రాబోయే రోజుల్లో మరింత మెరుగైన సేవలు అందిస్తాం. ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, నేర రహిత సమాజ నిర్మాణం దిశగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ విజయకృష్ణ, పిసిఆర్ సీఐ దుర్గ ప్రసాద్, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ఆర్ఐ సీతరామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమ ప్రాంత వాసుల చిరకాల వాంఛ ప్రతిరూపమే

## మార్కాపురం నూతన జిల్లా

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 30)**

వైకాపా ప్రభుత్వ హయాంలో పశ్చిమ ప్రాంత అభివృద్ధి శూన్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాను మంగళవారం రాష్ట్ర క్యాబినెట్లో ఆమోదం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. మార్కాపురం పురపాలక సంఘంలోని జవహర్ నగర్‌లోని వైట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన 33, 34, 35 వార్డుల్లో సాయంత్రం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా కాలంలో పశ్చిమ ప్రాంతానికి వరగబెట్టిందేమీ లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన వైకాపా పూర్తి చేయకుండానే అంకితం చేశామంటూ మోసం చేశారన్నారు. వైకాపా హయాంలో 29 ప్రభుత్వ పథకాలకు జగన్ పేరు పెట్టి అమలు చేశారని, అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రాంత వెనుకబాటును గుర్తించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రన్న పేరును మార్కాపురం జిల్లాకు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. జీవించి ఉన్న జగన్ పేరు పెట్టినప్పుడు, చంద్రన్న పేరుకు అభ్యంతరం ఏంటని విమర్శించారు. మార్కాపురం జిల్లా ప్రకటనతో పశ్చిమ ప్రాంతంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు అన్నారు. టిడిపి తీసుకున్న నిర్ణయాన్ని ఓరవలేకనే విమర్శలు చేస్తున్నారనారు. త్వరలోనే చంద్రన్న మార్కాపురం జిల్లా ను అభివృద్ధి పదంలో నడుపుతామన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంద అన్నారు. ఓట్లు దండుకొని వైకాపా ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇవ్వకుండా వివక్షత చూపిందని, ఎన్నికలు ఇచ్చిన వాగ్దాన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు మార్కాపురం జిల్లాను ప్రకటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా చంద్రబాబు నిలిచిపోయారన్నారు. దోచుకోవడం దాచుకోవడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం వైకాపా చేసింది శూన్యమన్నారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తిచేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తన హయాంలో జిల్లా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజా మద్దతుతో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు ప్రతి కార్యకర్తకు తోడుగా నిలుస్తానని, పేద ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కి వార్డు ప్రజలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివి కృష్ణారావు, తెలుగుదేశం నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాల పునర్విభజన ప్రతిపాదలను క్యాబినేట్ ఆమోదం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)**


రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబ్ నేట్లో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతి పాదనలకు ఆమోదం తెలపడంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు నియోజక వర్గాన్ని, బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేరుస్తూ 28 మండలాలతో ప్రకాశం జిల్లాను పునర్వ్యవస్థీకరిస్తూ మంగళవారం జిఓఎంఎస్ నెం 523ను జారి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం, మర్రిపూడి, పొన్నలూరు మండలాలతో కూడిన కందుకూరు రెవెన్యూ డివిజన్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్లో కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్, కొత్తపట్నం, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, టంగుటూరు మండలాలు ఉంటాయని పేర్కొన్నారు. కొరిసపాడు, జే పంగులూరు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, తాళ్ళూరు, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

# "రెవెన్యూ క్లీనిక్స్" పేరుతో రెవిన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలి





## సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి




**(షణ్ముఖ వెలుగు, చీరాల, డిసెంబర్ 30)**

"రెవెన్యూ క్లీనిక్స్" పేరుతో రెవిన్యూ సమస్యలన్ని పరిష్కరించాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఆమె వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిపూర్ణంగా పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశమని సిసిఎల్ ఏ ప్రత్యేక కార్యదర్శి చెప్పారు. నమోదైన అర్జీల పరిష్కారం కొరకు సంబంధిత గ్రామాలలోకి దస్త్రాలను తీసుకువెళ్లి విచారించాల్సి ఉందన్నారు. తొమ్మిది జిల్లాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, బాపట్ల జిల్లాలోనూ ఈ కార్యక్రమం సమర్థంగా నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా అర్జీదారుల అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యతతో అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమాలలోనే రెవిన్యూ దస్త్రాలను డిజిటైజేషన్ చేయాలన్నారు. పాత దస్త్రాలన్నింటిని అత్యంత భద్రతతో స్కానింగ్ చేసి, తదుపరి సంబంధిత పోర్టల్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉందన్నారు. కొత్త జిల్లాల ఆవిర్భావ చట్టం అనుసరించి కలెక్టర్లు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



## నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అసాంఘిక, అనుచిత, అనుమతులు లేని కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)**

జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అసాంఘిక, అనుచిత, అనుమతులు లేని కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. నూతన సంవత్సర సంబరాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలు జగరకుండా పోలీస్ అధికారులు అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలి ఆదేశాలు జారీ చేశారు. న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొనుటకు కేక్ కట్టింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే సంగీతం, రోడ్డు కూడళ్ళలో గుమిగూడటం, బహిరంగంగా పార్టీలు, నృత్యాలు తదితర నూతన సంవత్సర వేడుకలను బహిరంగ ప్రదేశాలలో నిర్వహించరాదన్నారు. పెద్ద, పెద్ద ధ్వనులతో లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టి ప్రజాశాంతికి భంగం కల్గించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో టపాకాయలు కాల్చడం, ఏ విధమైన ప్రదర్శనలు నిర్వహిం చడానికి అనుమతి లేదన్నారు. హాస్పిటల్స్, వృద్ధాశ్రమాలు, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు డీజేలు పెట్టరాదన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి అధిక శబ్దాలతో ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైక్, కార్ రేసింగ్ చేసే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, సంబరాల పేరుతో రౌడీయిజం చేసినా, దురుసుగా ప్రవర్తించినా, బహిరంగ ప్రదేశాల్లో జన నివాస, సంచార ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం మత్తులో డ్రైవ్ చేసినా, ప్రజా రవాణాకు అడ్డంకులు సృష్టించేలా వాహనాలు నడపినా ఉపేక్షించేది లేదన్నారు. వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, దాబాలు, ఇతర అవుట్ లెట్లు, వ్యాపార సముదాయాలను నిర్దేశిత సమయాల్లో మూసివేయాలన్నారు. లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఒంగోలు పట్టణంలో బైక్ రేసింగ్, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాత్రి 10.00 గంటల తర్వాత కర్నూల్ రోడ్ బైపాస్ ఫ్లైఓవర్‌ను మూసివేస్తామన్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ డిఎస్పీల పర్యవేక్షణలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో డిసెంబర్ 31వ తేది సాయంత్రం నుండి అన్ని ముఖ్య కూడళ్ళలో పోలీస్ పికెట్స్ 136, మొబైల్ పార్టీలు 56, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు 30, నైట్ గస్తీ బృందాలను వుంచి నూతన సంవత్సర వేడుకలలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేలా నిరంతర పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఒంగోలు పట్టణంతో పాటు జిల్లాలోని ఇతర ముఖ్య పట్టణాలు మరియు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనున్నారని చెప్పారు. ఒంగోలు పట్టణంలోని కొప్పోలు రోడ్, మంగమూరు రోడ్, పేర్నమిట్ట రోడ్‌లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయబడతాయన్నారు. అనవసర సంచారాన్ని నివారించేందుకు డ్రోన్ పర్యవేక్షణతో పాటు పెట్రోలింగ్ నిర్వహించనున్నామన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను పర్యవేక్షించేందుకు ఎంఎస్‌సిడి లను వినియోగించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు గమనించి స్థానిక పోలీసులకు సహకరించాలని, ఎవరైనా మితిమీరి ప్రజా జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా బంధుమిత్రులతో కలసి ఆనందంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, ఈ నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సరికొత్త విజయాలను అందుకొని అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.



# పేకాట శిబిరం పై దాడి రూ.5040 నగదు స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 30)**

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ పి చౌడయ్య మంగళవారం తన సిబ్బందితో దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.5040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# కూటమి పాలనతో రాష్ట్రానికి కొత్త ఉత్సాహం



## పాలనలో ప్రజాస్వామ్యానికి నూతన దిశ
## ప్రజా సంక్షేమంలో చారిత్రాత్మక విజయాలు
## సూపర్ సిక్స్‌తో సంక్షేమ విప్లవం
## పజాభిప్రాయం మేరకు నూతన జిల్లాలు
## సీఎం చంద్రబాబు పాలన దేశానికి ఆదర్శం
## స్వర్ణాంధ్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు ఇన్‌ఛార్జి, డిసెంబర్ 30)**

రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో కూటమి ప్రభుత్వం చరిత్రాత్మక విజయాలను సాధించిందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. "ప్రజల సంక్షేమం – ప్రభుత్వ బాధ్యత" అనే నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు నేరుగా లబ్ధి చేకూరిందని, ఇది దేశంలోనే ఓ వినూత్న కార్యక్రమమని అన్నారు.

**అన్ని వర్గాల అభ్యున్నతికే...**

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మహిళలు రైతులు కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ స్త్రీ శక్తి పథకం కింద ఇప్పటివరకు 3.25 కోట్ల ప్రయాణాలు జరిగాయని, ఇందుకోసం రూ.1,144 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,310 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, ఎక్కడైనా పింఛన్ పొందే వెసులుబాటు కల్పించడంతో పాటు, మత్స్యకారులకు భరోసా, నేతన్నలకు ఉచిత విద్యుత్,ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం,అన్న క్యాంటీన్ల ద్వారా కోట్లాది మందికి భోజనం అందించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు, మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టామని, 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. డిజిటల్ హెల్త్ కేర్, యూనివర్సల్ హెల్త్ పాలసీ, ఎన్టీఆర్ బేబీ కిట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు విద్యా–ఆరోగ్య రంగాల్లో కొత్త దిశ చూపుతున్నాయని పేర్కొన్నారు.

**పరిశ్రమలు–ఉపాధి–పెట్టుబడులు...**

సీఐఐ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం రాష్ట్ర ఆర్థిక బలాన్ని సూచిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. విశాఖ ఐటీ హబ్, అమరావతి అభివృద్ధి, సెమీకండక్టర్ పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో రాష్ట్రం భవిష్యత్తు వైపు దూసుకుపోతోందన్నారు.

**సాగునీరు–మౌలిక వసతులు...**

పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులకు వేగం పెరిగిందని,భూగర్భ జలాలు 6.08 మీటర్ల వరకు పెరిగాయని చెప్పారు.రికార్డు స్థాయిలో 34.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.8,120 కోట్లు చెల్లించామని తెలిపారు.

**పారదర్శక పాలన – ప్రజలతో ప్రభుత్వ అనుసంధానం**

వాట్సాప్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్స్, స్పీడ్ ఆఫ్ డెలివరీ ద్వారా ప్రజలకు తక్షణ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, 13,326 గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం లో అనాలోచితంగా అస్తవ్యస్తంగా ఏర్పాటుచేసిన జిల్లాలతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం 26 జిల్లాలను ప్రజల అభిప్రాయాలు మేరకు 28 జిల్లాలుగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాదు. చేసే ప్రతి పని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందన్నారు.రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం"అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 30)**

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ మురళికృష్ణ పేరొన్నారు. ఆయన అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న జల్ జీవన్ మిషన్ పనులను త్వరిగతిన పూర్తిచేయాలనిన్నారు. తహసీల్దార్, నీటిపారుదల, దేవాదాయశాఖ, ర.భ. శాఖ అధికారులు సమావేశం హాజరుకాని వారి ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ క్లినిక్ కేంద్రంలో అసంపూర్తి భవనాల పనులు పూర్తి చేయాలని సోసైటీ చైర్మన్ వెంకటేశ్వరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో పనులకు మండల తీర్మాణం లేకుండా పనులు చేయడం పై గొట్లగట్టు ఎంపీటీసి రామ నారాయణరెడ్డి ఎంపీడీవోను వివరణ అడిగారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఉన్నతాధికారులు తెలిపిన ప్రకారం పనులు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపీవో బులెన్‌రావు, ఏవో ప్రకాషరావు, ఏపీఎం సుధాకార్, సర్పంచులు, ఎంపీటీసులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి




**(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, డిసెంబర్ 30)**

మండల ప్రజలకు నాగులుప్పలపాడు ఎస్ఐ షేక్ రజియా సుల్తానా బేగం మంగళవారం ఓ పత్రికా ప్రకటన ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా అసంఘటిత కార్యకలాపాలకు పాల్పడినా సామాన్య ప్రజలకు ఇబ్బందులు కల్పించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రైవేటు ఈవెంట్లకు డీజే సౌండ్ ఈవెంట్లకు ముందస్తు పర్మిషన్లు తప్పనిసరి అని తెలిపారు. అశ్లీలత ప్రదర్శనలు నృత్యాలు, గంజాయి, అధిక ధ్వని శబ్దాలను నిర్వహిస్తే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఆయుధాలను ఉపయోగించటం, బాణాసంచి కాల్చడం పూర్తిగా నిషేధమని వివరించారు. అంబులెన్సుకు వాహనాలకు, ట్రాఫిక్ కి అంతరాయం లేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. బైకుపై, కారు ర్యాలీలు పొలిటికల్ ర్యాలీలు పూర్తిగా నిషేధమని వివరించారు. ఫ్లెక్సీలు ఏర్పాటు సమయంలో పార్టీలకు అలాగే వ్యక్తులకు మనోభావాలు దెబ్బ తీసేలా మరియు ఉద్దేశపూర్వకంగా ప్రేరేపణ కలిగేలా ఉండరాదని వెల్లడించారు. పోలీస్ శాఖ సిబ్బంది అనునిత్యం డ్రోన్లు సర్వలెన్స్ తో నిఘా అన్ని గ్రామాలపై ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐతో పాటు పోలీస్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగిరి పై ట్రాఫిక్ జాం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఒంగోలు నగరంలోని శ్రీగిరి పై వెలసిన వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వచ్చిన భక్తులతో కొండపైకి వెళ్లే దారిలో సుమారు 2 కిలోమీటర్ల దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది వెంటనే ట్రాఫిక్‌ను దగ్గరుండి క్లియర్ చేసారు.

# ఉత్తమ కార్యకర్తలకు ప్రసంశా పత్రాలు అందించిన గూడూరి ఎరిక్షన్ బాబు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 30)**

యర్రగొండపాలెం గ్రామ పంచాయతీ క్లస్టర్ ఇంచార్జ్ షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్) పరిధిలో 5గురికి ఉత్తమ కార్యకర్తలుగా రాష్ట్ర కార్యాలయం నుండి వచ్చిన ప్రశంసా పత్రాలను టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అందించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువలో తమదైన శైలిలో చురుకుగా పని చేసినందుకు ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఉత్తమ కార్యకర్తలుగా షేక్ అజారుద్దీన్, బొందిలి కిషోర్ సింగ్, షేక్ ఫారుక్, షేక్ యూసుఫ్, గొర్ల నరసింహారావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, డిసెంబర్ 30)

మల్లవరం గ్రామంలో వెంసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తరద్వార దర్శనం వైభవంగా జరిగినట్లు చైర్మన్ రాఘవ తెలిపారు. అదే విధంగా పూజా కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. గట్టినేని కుటుంబ సభ్యులు, వారి అల్లుళ్ళు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, నారిపెద్ది వరహాల చౌదరి, రావి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కృష్ణారావు, అనంతలక్ష్మి, వెంకటేశ్వర్లు, రాంబాబు, ఆలయ ఈవో లీలా కృష్ణ, ప్రధాన అర్చకులు నారాయణ వెంకట రవికుమార్ ఆచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుండి మల్లవరం గ్రామంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.

## వెంకుపాలెంలో ముళ్ళమూరి వెంకటేశ్వర్లు విగ్రహావిష్కరణ







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 30)

మండలంలోని వెంకుపాలెం గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, బత్తుల బ్రహ్మానంద రెడ్డి, మాదాసి వెంకయ్య, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ దివంగత నేత మాజీ సర్పంచ్ ముళ్ళమూరి వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆయన చేసిన సేవలు మంచి పనులను కొనియాడారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు లేని లోటు మండలంలో వైఎస్ఆర్సిపి పార్టీకి తీరనిలోటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, పిల్లి తిరుపతిరెడ్డి, ప్రసాదు, గడ్డం వేణుగోపాల్, వై మాధవరావు, అనుమోలు ప్రసాదు, కాటా మాధవరావు, మండల వైఎస్ఆర్సిపి ఉప కన్వీనర్ కాటా మల్లికార్జునరావు, సుబ్బారావు, వైఎస్ఆర్సిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్రాంతపోలీసు అధికారులకు ఆత్మీయ సన్మానం చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

**75 వసంతాలు పూర్తి చేసుకున్న 14 మంది**
**రిటైర్డ్ పోలీస్ అధికారులు, సిబ్బందిని సత్కరించిన ఎస్పీ**
**దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించిన రిటైర్డ్ పోలీసుల అనుభవాలను**
**స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం**
**విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి**
**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**













(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

పోలీసు శాఖలో సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది, అధికారులకు ప్రకాశం జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం 6వ వార్షికోత్సవం సందర్భంగా పోలీస్ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రిటైర్డ్ పోలీసులలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 14 మంది పోలీస్ అధికారులను, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, పోలీసులు విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించారని వారిని ఎస్పీ గారు ప్రశంసించారు. గతంలో సాంకేతిక పరిజ్ఞానం లేదని అయినప్పటికీ అనేక ముఖ్యమైన దొంగతనం, దోపిడీ, హత్య కేసులు మరియు కీలక కేసులు సేదించడంలో ఎంతో నైపుణ్యత కనపరిచారన్నారు. సుదీర్ఘకాలంపాటు నిస్వార్ధంగా సేవలు అందించినందుకు వారికి పోలీసు శాఖ తరపున ఎస్పీ గారు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల, సిబ్బంది అనుభవాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని అన్నారు. రిటైర్డ్ పోలీసులను సన్మానించడం ఒక మంచి కార్యక్రమామని, ఇలాంటివి ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా విశ్రాంత ఉద్యోగులంతా గొప్ప సత్సంబంధాలతో మెలిగి ఉండడమే కాక క్రియాశీలక పోలీసులతో కూడా మమేకమయ్యేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విశ్రాంత పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తానని, వారికి ఎలాంటి సమస్య ఉన్న సహాయం కావాలన్నా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం విశ్రాంత పోలీసు అధికారులు జిల్లా ఎస్పీని శాలువతో సన్మానించి, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనమహోత్సవం

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 30)


మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలో సుమారు 6 శతాబ్దాల క్రితం జనమేజయ మహారాజు ప్రతిష్టింపబడిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అనాది నుండి దైవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ప్రాంతంలో మార్కాపురం చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల తర్వాత ఈ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వాముల వారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు క్రమం తప్పకుండా అంగరంగ వైభవంగా ఆలయ నిర్వహకులు ఘనంగా నిర్వహించేవారు. గతంలో ఈ ఆలయంలో తూర్పు, దక్షిణ ద్వారములు మాత్రమే కలవు. ప్రస్తుతం దాతల ఆర్థిక సహకారంతో ఆలయానికి ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం, పశ్చిమ ద్వారాలను గత ఏడాది ఏర్పాటు చేయడం జరిగింది. దీని మూలాన ఉత్తర ద్వారం ద్వారా విష్ణుమూర్తిని దర్శించుకొనుటకు, పశ్చిమ ద్వార దర్శనం ద్వారా ఆలయానికి అనుసంధానమైన శ్రీ భద్రకాళి సమేత శ్రీభద్రేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించుకోవడం వలన శివకేశవులకు భేదరహితాన్ని సూచిస్తుంది. ఇలాంటి ఆలయంలో తెల్లవారుజామున 3.30 గంటల నుండి 6.30 గంటల వరకు, తీర్థపుబిందె, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజ, నైవేద్యం, మంగళ హారతి కార్యక్రమాలు వేదపండితులైన కారంపూడి రమణాచార్యులు, కారంపొడి సాయి మోహన్‌లు నిర్వహించడం జరిగింది. అనంతరం 7 గంటల నుండి 10 గంటల వరకు నగర ఉత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధనుర్మాశాంతం పూలమాలలు, అల్పాహార దాత స్వర్గీయ గోపువెంకటయ్య జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని గోపు శ్రీదేవి మరి వారి కుమారులు, కేకేఆర్, హాస్పిటల్ వారు లడ్డు ప్రసాద వితరణ ధాత పోలేపల్లి జనార్ధనరావు, దేవత వస్త్రముల సమర్పణ దాత గాదంశెట్టి సుబ్బరత్నం ధర్మపత్ని కృష్ణకుమారి వారి కుటుంబీకులు, భక్తులకు పాలు వితరణ చేసిన దాత కుర్రి రామాంజనేయులు, ముక్కోటి ఉత్సవ శాశ్వత ఉభయదాతలు స్వర్గీయ ఆలయ మాజీ ధర్మకర్త జవ్వాజి లక్ష్మీసుబ్బయ్య, ధర్మపత్ని ఈశ్వరమ్మ ల వారసుడు, అనువంశిక ధర్మకర్త అయిన జవ్వాజీ విజయభాస్కరరావు కుటుంబీకులు, ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, గ్రామ పెద్దలు, ఉభయ దాతలు, గ్రామ ప్రజలు మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ముక్కోటి ఏకాదశి పర్వదినాన్నిఅంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది.







# ప్రతి డివిజన్‌లో కమ్యూనిటీ హాలు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

ఒంగోలు నగరంలోని ప్రతి డివిజన్లో ఒక చిన్న కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయనున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు వెల్లడించారు. పదవ డివిజన్లోని కొప్పోలులో రూ.2.20 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవన్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ముందుగా భవన ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ భవన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దామచర్ల మాట్లాడుతూ ఒంగోలులో కూడా లేనివిధంగా కొప్పోలులో అంబేద్కర్ భవన్ నిర్మించారని తెలిపారు. ఈ డివిజన్ కార్పొరేటర్ బెంగళూరు నరసయ్యను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. నరసయ్య జీవితాంతం గుర్తుపెట్టుకునే విధంగా అంబేద్కర్ భవన్ నిర్మించారని తెలిపారు. నాయకుడికి ఒక విజన్ ఉండాలని, విజన్ ఉన్నప్పుడే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. తను మొదటిసారిగా ఎమ్మెల్యే అయిన 14-19 మధ్యలో కొప్పోలులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి దామచర్ల జనార్దన్ రావు ప్రస్తావించారు. ఎక్కడ అనధికార కట్టడాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో ఒంగోలులో ఎక్కడ చూసినా కబ్జాలు చేసే ముఠాలు, గంజాయి బ్యాచ్ లు తిరిగాయని, ప్రస్తుతం అలాంటివి పూర్తిగా నిరోధించి ప్రజలు ప్రశాంతంగా ఉండేలా వాతావరణం కల్పించినట్లు వివరించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పదవ డివిజన్లో ఐదు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. డివిజన్ కార్పొరేటర్ నరసయ్య పట్టుబట్టి నిధులు రాబట్టుకొని అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, నాయకులు పాలూరి వెంకటేశ్వరరెడ్డి, కసుకుర్తి అంకరాజు, మహిళా నాయకురాలు అజీమున్నీసా, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# దళిత యువతి నళినీ కేసులో నయవంచకుల్ని అరెస్టు చేయాలి

**నేర తీవ్రతను బట్టి కాక, కులాన్ని బట్టి స్పందిస్తున్న కూటమి ప్రభుత్వం**

**కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి**

**దళిత హక్కుల నేత నీలం నాగేంద్ర డిమాండ్**

**ఆర్డీఓ విచారణ, నిందితుల అరెస్టుకు, ఆదేశించిన కలెక్టర్ రాజాబాబు**








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

దళిత ఎంటెక్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మైరాల నళినీ బలవన్మరణం కేసులో దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు డిమాండ్ మేరకు, నిందితుల అరెస్టుకు, ఆర్డీఓ విచారణకు కలెక్టర్ రాజాబాబు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ముందు దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మైరాల నళినీ బలవన్మరణం, ఎస్సీ ఎస్టీ కేసులో నిందితుల అరెస్టు కోరుతూ ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్ర రావు మాట్లాడుతూ, నళినీ మాల కులస్తురాలు కాబట్టే కేసు దర్యాప్తుపై కుల వివక్ష, అధికార పార్టీ నాయకుల ప్రభావం ఉందన్నారు. మత్స్యకార కులానికి చెందిన సింగోతు శ్రీనివాస్ గత పది సంవత్సరాలుగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మరొక వివాహిత మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకొని మోసగించడంతో ఈనెల 7న మైరాల నళినీ బలవన్మరణానికి పాల్పడిందన్నారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాస్ రావు డ్యూటీలో లేరని వన్టౌన్ సీఐ ప్రాథమిక దర్యాప్తు చేశారన్నారు. నళినీ మృతదేహం వద్ద నళినీరాసిన సూసైడ్ లెటర్ దొరికిందని, పోలీసులు మృతురాలి స్వాధీనం చేసుకున్న నళినీ ఫోన్లో నళినీ బలవన్మరణం బలవన్మరణానికి, సింగోతు శ్రీనివాస్, అతని కుటుంబ సభ్యుల నయవంచనకు సాక్షాలు లభించాయన్నారు. నళినీ బలవన్మరణానికి కంటికి కనిపించే సాక్షాలు లభ్యమైనప్పటికీ, పోలీసులు బలవన్మరణం మరియు ఎస్సీ ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయలేదన్నారు. బి.ఎన్.ఎస్ 194 అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన విషయం కూడా దాచి పెట్టారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 8వ తేదీ శవ పంచనామా సమయంలో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన విషయం బయటపడిందన్నారు. ఎస్సీ ఎస్టీ యాక్ట్ వేయాలని, బలవన్మరణం కింద సెక్షన్ 108 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తే, టూ టౌన్ సిఐ మేడ శ్రీనివాసరావు డిఫెన్స్ లాయర్ లాగా నిందితులకు వత్తాసుగా మాట్లాడారన్నారు. న్యాయం జరగకపోతే శవాన్ని కూడా స్వాధీనం చేసుకోబోమని తేల్చి చెప్పాకే, సీఐ మేడా శ్రీనివాస్ రావు అధికార పార్టీ నేతలా అయిష్టంగానే సెక్షన్ ఆల్టర్ చేశారన్నారు. ఈ నెల 10 న కలెక్టర్ రాజబాబుని కలిసి, నళినీ కేసు గురించి మాట్లాడానని, నిందితుల్ని అరెస్టు చెయ్యాలని కలెక్టర్ ఎస్పీకి లేఖ రాశారన్నారు. కలెక్టర్ లేఖకు కూడా పోలీసులు స్పందించలేదన్నారు. నళినీ బలవన్మరణానికి పాల్పడి 24 రోజులు, కలెక్టర్ లేఖకు 20 రోజులు దాటినా న్యాయం బాధిత కుటుంబం దాకా రాలేదన్నారు. అందుకే కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో రోడ్డెక్కితే గానీ మాలలకు న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. రోడ్డెక్కిన న్యాయం జరుగుతుందన్న నమ్మకం కూడా కొండెక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నేర తీవ్రతను బట్టి కాకుండా కులాన్ని బట్టి స్పందిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజా బాబును కలిసేందుకు కలెక్టరేట్ కు వెళ్లారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో ఉండటంతో, డీఆర్ఓ ఓబులేసు తన ఛాంబర్ కు వచ్చి నాగేంద్రతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలైనా అమలు జరిగేలా చూడాలని నాగేంద్ర డీఆర్వో ను కోరారు. సమస్య తీవ్రతను గ్రహించిన డీఆర్ఓ ఓబులేసు కలెక్టర్ కు విషయం చెప్పారు. నిందితుల్ని అరెస్టు చెయ్యాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆర్డీఓ విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు యాదాల రాజ్ శేఖర్, కట్టా సుధా, జమున, మాల మహానాడు నాయకులు కాకుమాను రవి, దళిత నాయకులు పత్రా బంగారం, జీవరత్నం, కబాడీ పాలెం యూత్ రాజేష్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, డిసెంబర్ 30)

రైతును రాజు చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చింతగుంట గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రజలను నిలువున్న దగా చేశారని త్వరలో వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఈ ప్రాంత రైతులు కళ్ళలో ఆనందం చూస్తామన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఈ ప్రాంతానికి దూరం చేసి రైతుల నోట్లో మట్టి కొట్టిన చరిత్ర వైసిపి పార్టీని అన్నారు. రైతులు పండించిన మిర్చిని నేరుగా అమ్ముకోవద్దని ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మిషన్లో ద్వారా మిర్చిని మిర్చి పౌడర్ గా మార్చి అమ్మితే అధిక లాభాలు ఉంటాయని సూచించారు. అనంతరం మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్ఐ

**సైబర్ నేరాల పై అవగాహన కల్పించిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ సాజిద్**






(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 30)

మాజీ సైనికుల సంఘం కంభం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కంభం ఎస్ఐ ఏ శివ కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు, పెన్షన్ దారుల సంక్షేమం కోసమే కాకుండా, పోలీస్ శాఖ వారికి అవసరమయినప్పుడు, సేవలు అందిస్తున్నందుకు గాను సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు సేకరిస్తూ, జిల్లా కలెక్టర్‌తో మెమెంటో పొందటం హర్షణీయమని తెలియజేశారు. తదుపరి మాజీ సైనికులు ఎస్సై ని ఘనంగా సత్కారం చేశారు. అనంతరం సైబర్ నేరాల పై డిజిటల్ స్కాముల పై సైబర్ సెక్యూరిటీ ఇంజినీర్ షేక్ సాజిద్ మాజీ సైనికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తం గా ఉండాలని, ఓటీపీ, తెలియని లింక్స్ ని క్లిక్ చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో సెట్లేమ్ వేణు గోపాల్, అధ్యక్షులు, వైస్ ప్రెసిడెంట్ అంకయ్య గౌడ్ ,సెక్రెటరీ పుల్లయ్య, జాయింట్ సెక్రటరీ యస్ ప్రసాద్, పోలయ్య, కార్యవర్గసభ్యులు మస్తాన్ వలి, స్వామి కుమార్, రోషిరెడ్డి, అక్తర్ హుస్సేన్, వీరనారి, పలువురు మాజీ సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో ఘనంగా ముక్కోటి వేడుకలు

**వేల సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు**

**సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

“ నేల ఈనిందా!! దివి వైకుంఠం భువికి దిగి వచ్చిందా!!” అన్నట్లు ముక్కోటి వేళ శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం మంగళ వారం భక్తజనంతో కిటకిటలాడింది. అన్ని దారులు శ్రీగిరికే అన్నట్లు వేల సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండే తమ ఇష్ట దైవం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో బారులు తీరారు. గోవిందో గోవింద! అంటూ భక్తులు తన్మయత్వంతో పిలిచే పిలుపులతో శ్రీగిరి ప్రతిధ్వనించింది. వైకుంఠ ఏకాదశి ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో కూడి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరిలో నూతనంగా ప్రవేశ పెట్టిన శీఘ్ర దర్శనం పథకం విజయవంతమైంది. శ్రీగిరి మెట్ల మార్గం ద్వారా కూడా భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పలు రంగాల ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామ కృష్ణారావు, ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులతో పాటు ఆలూరు జై శంకర్, ధర్మకర్తల మండలి ప్రతినిధులు, తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.





## బాలల పై లైంగిక దాడుల నివారణ కొరకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

ఒంగోలు రిమ్స్ సర్వజన వైద్యశాల నందు గల బాల భవిత కేంద్రం నందు మంగళవారం “బాలలపై లైంగిక దాడుల నివారణ” గురించి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరధి దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం మెడికల్ ఆఫీసర్ ప్రీతం, డిఈఐసి మేనేజర్ స్టెఫీగ్రాఫ్, చైల్డ్ సైకాలజిస్ట్ కరవది అనిల్ పాల్గొని పిల్లలపై లైంగిక దాడులు రకాలు, పిల్లలపై మానసిక గాయాలు వాటి ప్రభావాలు, పిల్లల ప్రవర్తన పై శిక్షణ ఇచ్చారు. అలాగే పిల్లల పై అకృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని పిల్లలకు అవగాహన హద్దులు కమ్యూనికేషన్ గురించి చెప్పాలని సిబ్బందికి తెలియజేశారు. ముఖ్యంగా పిల్లల రక్షణ చట్టాలైన ఫోక్సో 2012 చట్టం గురించి అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాల భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత డెంటిస్ట్ డాక్టర్ జయలక్ష్మి, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ విద్య, సోషల్ వర్కర్ రాము జిల్లా నలుమూలల నుంచి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు పాల్గొని విజయవంతం చేశారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)
ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో అత్యధికంగా రెవెన్యూ సమస్యల పై అర్జీలు వస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ద చూపాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ అంశాలు, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, రేషన్ షాపుల తనిఖీలు, దీపం 2 పథకం అమలు, ధాన్యం సేకరణ, రెవెన్యూ రాబడి, నీటి ఆడిటింగ్, నీటి బడ్జెట్. భూగర్భ జలాల వాస్తవ తనిఖీ మరియు నీటి వనరుల విశ్లేషణ, కేంద్ర ప్రాయోజిత పథకాల పనుల పురోగతి, గృహ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. తొలుత రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. అందులో భాగంగా ఈ నెల 29వ తేదీ నుండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లీనిక్ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికార యంత్రాంగం కూడా అదే దృక్పథంతో వ్యవహరించాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వస్తున్న అర్జీలలో సుమారు 70 శాతం మేర రెవెన్యూ సంబంధిత అంశాలపైనే వస్తుంటాయని, సంబంధిత రెవెన్యూ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోపు వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాక, వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు సానుకూల విధానంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రెవెన్యూ సమస్యలపై అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు పరిశీలన చేసినప్పుడే సంబంధిత సమస్య నాణ్యతతో పరిష్కరించేలా వీలౌతుందన్నారు. సమస్య పరిష్కారం అయిన తరవాత పరిష్కార విధానం, దరఖాస్తుదారుల సంతృప్తి చెందారా.. లేదా అన్న విషయాన్నీ అధికారులు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ సేవలపై ప్రజలకు అనుకూల అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. అనంతరం పౌర సరఫరాల విభాగం పై సమీక్షిస్తూ, జిల్లా లోని అన్నీ మండలాల్లో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్యాస్ పంపిణీ, రేషన్ పంపిణీలలో వినియోగదారులతో ఐవిఆర్ఎస్ (%×ఎ=ూ%) ద్వారా వచ్చే వారి అభిప్రాయాలు తీసుకుంటామని, ఏ వినియోగదారుడైనా వంట గ్యాస్ అందించే డెలివరీ, రేషన్ సరుకులు అంశాలలో ఫిర్యాదు చేస్తే సంబంధిత వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు రైతులు ఇబ్బందులు పడకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గృహ నిర్మాణాలను పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, మైనింగ్, కమర్షియల్ టాక్స్ శాఖల అధికారులు ప్రభుత్వ రెవెన్యూ రాబడి పై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద చేపట్టిన పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, జాన్సన్, మాధురి, కళావతి, కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత శాఖల క్షేత్ర స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ప్రకృతి వ్యవసాయానికి ఊతం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, డిసెంబర్ 30)
ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయడంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డిఆర్డిఎ వెలుగు, వ్యవసాయశాఖ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జె మోహన్ కోరారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మండల ఎపిఎమ్ సుబ్బారావు అధ్యక్షతన రైతులతో ప్రత్యేక మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జె మోహన్ పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం పై మేలుకువలను, సలహాలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎపిఎమ్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణుల ప్రకృతి వ్యవసాయం ప్రధాన జీవనోపాధి చేసుకొని ఖర్చు అదుపులో వుంచుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుట ద్వారా పేదరికాన్ని తగ్గించుకోవచ్చాన్నారు. మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణకు, భూమి ఆరోగ్యం మెరుగుపరచడానికి, ప్రకృతి విపత్తుల నుండి పంటలను రక్షించుకోవడానికి ప్రకృతి వ్యవసాయం ఏకైక మార్గమన్నారు. కార్యక్రమం అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులు రాజేష్, జయరావులను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యధికారి విజయబాబు, డాక్టర్ సాయి శ్రీ చరణ్, ఐసిడిఎస్ సిడిపిఓ సులోచన రాణి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భారతి, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్స్, విఏఎలు, మండల సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సమైక్య ప్రతినిధులు, యానిమేటర్స్, ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్ బి జయమ్మ, శ్రీలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అద్దంకి పట్టణంలో అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 30)
అద్దంకి పట్టణం నందు అద్దంకి రెవిన్యూ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి పట్టణంలో ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌ను అద్దంకి రెవిన్యూ డివిజనల్ కార్యాలయంగా మార్పు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం అద్దంకి పట్టణం లో అద్దంకి రెవిన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## సేవలకు గుర్తింపు కడప జిల్లా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుగా అన్నంరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 30)
బిజెపి పార్టీలో అనేక సంవత్సరాలుగా అన్నం రెడ్డి అశోక్ కుమార్ రెడ్డి చేస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులుగా నియమించిన బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డితో పాటు ఇందుకు సహకరించినటువంటి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమార స్వామి , కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డిలకు, బిజెపి కుటుంబ సభ్యులు అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## 60 అంశాలలో సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించాం

### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాదాపు 60 అంశాలలో సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేశామని సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ అన్నారు. ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంతనూతలపాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే గత వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడం వలన తుఫాను వచ్చిన నేపథ్యంలో విపత్తు జరగకుండా ప్రజల ప్రాణాలు కాపాడగలిగామని తెలిపారు. ప్రతినెలా ఒకటవ తారీఖున ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యంగా వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 8 కోట్లకు పైగా నిధులను సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచామని తెలిపారు. కారుమంచి కాలవకు కూడా నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే డిజైన్ పూర్తి చేసి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టామని, మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్ల మార్గాలకు నిధులు వెచ్చించి పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల కంటే మిన్నగా అభివృద్ధి కార్యక్రమాలను సంతనూతలపాడు నియోజకవర్గంలో చేపట్టామని, రానున్న రోజుల్లో కూడా మరింతగా ప్రజలకు అండగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ మీడియా సమావేశంలో మండవ జయంత్ బాబు, ఏఎంసి చైర్మన్ మన్నం ప్రసాద్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తెళ్ళ మనోజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బురి శ్రీనివాసరావు, మండల సెక్రటరీలు ఇస్త్రార్ల ఏడుకొండలు, మందపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

### 10 గ్రామాలలో గ్రామసభల నిర్వహణ

### తాసిల్దార్ ఆర్ బ్రహ్మయ్య



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 30)
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చీమకుర్తి మండలంలో రీ సర్వే పూరయిన 10 రెవిన్యూ గ్రామాలకు వచ్చిన పట్టాదారు పాసుపుసకాలను రెవెన్యూ గ్రామం నందు గ్రామ సభ నిర్వహించి పంపిణీ చేయటం జరుగుతుందని తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 2.1.2026న ఉదయం 10.30కు గాడిపర్తివారిపాలెం గ్రామ సచివాలయం నందు, మధ్యాహ్నం 2.30కు గ్రామ నేకునంబాదు పంచాయతీ కార్యాలయం వద్ద, 3.1.2026న ఉదయం 10.30 కు పడమటి నాయుడుపాలెం గ్రామ సచివాలయం, మధ్యాహ్నం 2.30 కు బండ్లమూడి గ్రామ సచివాలయం, 6.1.2026న ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం పిడతలపూడి, మధ్యాహ్నం 2.30కు యంపిపి స్కూల్ గుండువారి లక్ష్మీపురం నందు, 7.1.2026న ఉదయం 10.30 గంటలకు తొర్రగుడిపాడు గ్రామ సచివాలయం నందు, మధ్యాహ్నం 2.30 గంటలకు యం.పి.పి స్కూల్ కాందూరీ వారి అగ్రహారం నందు, 8.1.2025 న ఉదయం 10.30 గంటలకు యం.పి పి స్కూల్ భూసరపల్లి గ్రామం, మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామ సచివాలయం రాజుపాలెం లక్ష్మీపురం గ్రామం నందు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గ్రామ సభలు నిర్వహించే తేదీలలో సంబంధిత గ్రామాల రైతులు పాల్గొని వారికి ప్రభుత్వం వారు మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను అందుకోవాలని తహశీల్దార్ తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు







(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 30)

వైకుంఠ ఏకాదశి సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి శ్రీవారి, అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం భాగ్యం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రకాశం జిల్లా రాష్ట్ర ప్రజలు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఆస్థాన అర్చకులు శ్రీమాన్ వెంకటహరి కుమారాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి మహామండపం నందు సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతములు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా పెద్ద బాబు, శిద్దా సాయి బాబు దంపతులు, శిద్దా



బాలాజీ దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, శిద్దా కాశీ దంపతులు, ఏఎంసి చైర్మన్ మన్నం ప్రసాద్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాసం ఏకాదశి పునస్కరించుకొని శ్రీ వారి మండపంలో గోదాదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి విశేష



పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పాశురం సమర్పణ, తిరుప్పావై, విష్ణు సహస్ర నామ పారాయణం భక్తుల సహకారంతో నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, హరికృష్ణ శర్మ, ఉభయ దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.




# నేడు 7 గంటల నుండి యన్‌టిఆర్ పెన్షన్లు పంపిణీ

## జిల్లాలో 2,25,485 మందికి వివిధ రకాల పింఛన్లకు రూ.96.57 కోట్లు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 30)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న యన్ టి ఆర్ భరోసా ఫించన్లు బుధవారం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 జనవరి 1 వ తేదీ (నూతన సంవత్సరం కారణంగా) 2026 జనవరి 1న పంపిణి చేయవలసిన పెన్షన్లు బుధవారం ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల జిల్లాలో జనవరి, 2026 నెలలో 2,25,485 మందికి వివిధ రకాల పొందుతున్న ఫించన్ దారులకు రూ.96.57 కోట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం రోజే సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుండి నగదు డ్రా చేసుకోవడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుండి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బుధవారం రోజు వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. అనివార్య కారణాల చేత బుధవారం రోజు తీసుకోని వారికి 2వ తేదీ శుక్రవారం రోజు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# అరకు కాఫీ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల, డిఆర్‌డిఏ పీడీ నారాయణ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 30)

పొదిలి పట్టణంలోని కాలేజీ రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురు వెలుగు డిఆర్డిఏ ద్వారా ఏర్పాటు చేసిన నేటివ్ అరకు కాఫీ షాప్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. వెలుగు డిఆర్డిఏ ద్వారా కెనరా బ్యాంకు పొదిలి వారి ఆర్థిక సహాయంతో 6లక్షల 60 వేల యూనిట్ కాస్ట్‌తో, పీఎం ఎఫ్ఎంఈ స్కీం కింద, బండి ప్రసన్న డ్వాక్రా గ్రూపు సభ్యురాలికి ఈ అరకు కాఫీ షాప్ మంజూరు చేయడం జరిగిందని పిడి టీ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో డిఆర్‌డిఏ వెలుగు ద్వారా పొదుపు సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ షాపును ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ ఇలాంటి వినూత్నమైన జీవనోపాదుల కార్యక్రమాలు జిల్లా మొత్తం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిడి నీలకంఠారెడ్డి, లైలివుడ్ డిపిఎం దానం, ఎస్‌విఇపి ఎపిఎం సుబ్బారావు, ఎపిఎం గోపాలకృష్ణ, మార్కాపురం ఎఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, మాజీ మండల పార్టీ



అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఏఎంసి డైరక్టర్లు రోళ్ళ శ్రీను, సోమిశెట్టి శ్రీదేవి, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి ఎస్ ఎం భాష, మండల తెలుగుయువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, పట్టణ తెలుగు యువత అద్యక్షులు షేక్ కాలేషా, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, తానికొండ వెంకట్రావు, కొనకనమిట్ల మండల పార్టీ అద్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నిషా, సీసీలు, విఓఏలు, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


















# పీవీ పల్లి రెవెన్యూలో రైతులకు ఊరట

## జనవరి 2 నుంచి రీ సర్వే

## రీ సర్వేతో వివాదాలకు చెక్





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, డిసెంబర్ 30)


వివాదాలకు నిలయంగా మారిన పెద్దివెంకటాయ పల్లి రెవెన్యూలోని భూములను రీసర్వే చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలోని అగ్రహారంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓ కాశయ్యలు మాట్లాడుతూ పీవీపల్లిలో 1149 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. 160 ఎకరాల ప్రభుత్వ భూమి (వాగులు, వంకలు) కూడా ఉన్నాయన్నారు. ఈ భూముల్లో రీసర్వే నిర్వహించి రెవెన్యూ రికార్డుల ప్రకారం హక్కుదారులకు హద్దులు చూపించి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో ఇదే రెవెన్యూలోని సర్వే నెం.1 లోని 120 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమి అని చెప్పి అడ్డగోలుగా ఆన్‌లైన్ చేయించుకుని సూరబోయిన బాలయ్య, తదితరులు చేతివాటం ప్రదర్శించారు. ఈ అక్రమ ఆన్‌లైన్ పై అప్పటి తహశీల్దార్ హరిబాబు బాలయ్య కుటుంబీకుల పై కేసు నమోదు చేయించారు. అయినా కూడా భూ దళారులు ఇటీవల డ్రోన్ కెమెరాలతో సర్వే చేసి ఈ భూమంతా మాదేనని, భూ కొనుగోలుదారులను మభ్యపెడుతున్నారు. బాలయ్య భూ అక్రమాల పై రైతులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ఫిర్యాదు చేయడంతో రీ సర్వేకు ఆదేశించారు. ఆ క్రమంలో అధికారులు అగ్రహారంలో గ్రామ సభ నిర్వహించి జనవరి 2 నుంచి రీసర్వే చేస్తామని, రైతులు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ గ్రామ సభలో ఉమ్మనపల్లి టిడిపి అధ్యక్షుడు రంగసాయి యాదవ్, బాల కోటయ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మణరావు మృతి ఏపీడబ్ల్యూజెఎఫ్ కు తీరని లోటు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 30)

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులలో ఒకరు, సాక్షి దినపత్రికలో అసోసియేట్ ఎడిటర్ గా పనిచేసిన టి కే లక్ష్మణరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా శాఖ మంగళవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది. ఫెడరేషన్ ఆవిర్భావంలో చురుకైన పాత్ర పోషించడమే కాకుండా ఫెడరేషన్ బలోపేతం చేసేందుకు కృషిచేసిన లక్ష్మణరావు మృతి ఫెడరేషన్ కు తీరని లోటు అని ఏపీడబ్ల్యూజెఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ చిన్న కరిముల్లా, ప్రధాన కార్యదర్శి దాసరి సునీల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో పర్యటించి సంఘాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి మరిచిపోలేనిదన్నారు. లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు జిల్లా శాఖ తరుపున వారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# అక్రమ ఇసుక టిప్పర్లు పట్టివేత



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, డిసెంబర్ 30)

మండలంలోని మోటుపల్లి పంచాయతీ అడవిదిపాలెం గ్రామం నుండి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముడు టిప్పర్లను మంగళవారం స్వాధీనం చేసుకుని తహశీల్దార్ జె ప్రభాకకరావు అదేశాల మేరకు చిన్నగంజాం పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మోటుపల్లి విఆర్వో పి నాగరాజురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విఆర్వో నాగరాజురెడ్డి మాట్లాడుతూ తహశీల్దార్ జె ప్రభకరరావు అదేశాల మేరకు అక్రమ ఇసుక తరలింపు పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు పి నాగరాజురెడ్డి, షేక్ మునిర్ పాల్గొన్నారు.

## త్వరలో అందుబాటులోకి రానున్న అత్యాధునిక, మెరుగైన వైద్య సేవలు





(షణ్ముఖ వెలుగు, చీరాల, డిసెంబర్ 30)

అత్యాధునికమైన వైద్యం, మెరుగైన వైద్య సేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీర పాండ్యన్ చెప్పారు. చీరాల ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో రూ.2.5 కోట్లతో ఇండియన్ పబ్లిక్ హెల్త్ ప్రమాణాలతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ను కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, కలిసి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. వైద్యశాల ప్రాంగణమంతా కలియతిరిగి పరిశీలించారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ను కమిషనర్, కలెక్టర్ కలిసి పరిశీలించారు. రూ.25 కోట్లతో నాలుగు అంతస్తులు ఉండేలా చేపట్టిన భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. క్రిటికల్ కేర్ యూనిట్ 50 పడకలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో మంచి సేవలు అందుతాయన్నారు. జిల్లాలో చేపట్టిన భవనం నిర్మాణ పనులను కలెక్టర్ వివరించారు. ఏపీఎంఐడిసి ద్వారా జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని కమిషనర్ కు కలెక్టర్ చెప్పారు. ఏడాదిలోగా పూర్తికానుందని వివరించారు. ప్రస్తుతం చీరాల ప్రాంతీయ వైద్యశాలకు రోగులు అధికంగా వస్తున్నారన్నారు. ప్రతిరోజు 200 మంది నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నందున ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ అవసరం అవుతుందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి బాపట్లకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ మంజూరు చేసిందని వివరించారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, వైద్య అధికారులు, తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ భూములు ఏ మండలంలో ఉంటే ఆ మండలంలోని రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి

## పేదలకు నిర్మించే గృహాలు వేగవంతంగా పూర్తి చేయాలి
## గృహ నిర్మాణంలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా టాప్ 3లో ఉండాలి
## ఇంటింటి నుండి చెత్త వందశాతం సేకరించాలి
## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 30)

రైతుల వ్యవసాయ భూములు ఏ మండలంలో ఉంటే ఆ మండలంలోనే రైతులకు ఎరువులు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ నందు ఏరువులు పంపిణీ, ప్రధానమంత్రి అవాక్ యోజన పథకం ద్వారా నిర్మించే గృహ నిర్మాణాలు, మున్సిపాలిటీ సేవలు, ఇంటింటి నుండి చెత్త సేకరణ వంటి అంశాలకు సంబంధించి మండల వ్యవసాయ అధికారులు, ఏడీలు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ లు,డీఈలు, మున్సిపల్ కమిషనర్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రైతుల భూములు ఏ మండలంలో ఉంటే అదే మండలంలోనే రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయాలని సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఆదేశించారు. వ్యవసాయ సాగు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు పంపిణీ చేయవలసిన బాధ్యత మండల వ్యవసాయ అధికారుల పై ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎరువులు సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకురావాలన్నారు. ఎరువులు పంపిణీ సంబంధించి ఇంకా



ఇంప్రూవ్ చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఎమ్ఎస్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని, ఎరువులు బాగా పంపిణీ చేసిన మండల వ్యవసాయ అధికారులకు జనవరి 26వ తేదీన అవార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలాల వారీగా నిల్వఉన్న ఎరువులు వివరాలకు సంబంధించి కలెక్టర్ మండల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో గృహ నిర్మాణంలో బాపట్ల జిల్లా టాప్ 3 లో ఉండేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకము ద్వారా చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో నిర్మాణాలు చేపడుతున్న పేదల గృహాలకు సంబంధించి ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకురావాలన్నారు. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ను అప్డేట్ చేసి గృహ నిర్మాణాలు పూర్తిచేసుకునేలా వారికి అవగాహన నిర్మించాలన్నారు. గృహ నిర్మాణ కి సంబంధించి నిధులు పుష్కలంగా ఉన్నాయని, గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి అయ్యేలా గృహ నిర్మాణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ పురోగతిలో కొన్ని మండలాలు చాలా తక్కువగా ఉండటం వల్ల వాటికి సంబంధించి గల కారణాలను తెలియజేయాలన్నారు. మున్సిపాలిటీలలో ప్రతి రోజు ఇంటింటి నుండి వంద శాతం చెత్తను సేకరించి వెంటనే చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో చేపట్టే సేవల పై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ గృహ నిర్మాణ సంస్థ పిడి వెంకటేశ్వరరావు బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి మున్సిపల్ కమిషనర్లు రఘునాథ్‌రెడ్డి, రవేంద్ర బాబు, డానియల్ జోసఫ్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా ఏర్పాటుతో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 30)

పశ్చిమ ప్రాంతంలోని ప్రజల దశాబ్దాల కల అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు చిత్ర పటానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ప్రకాశం జిల్లాలో వెనుక బడిన పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురంను జిల్లా కేంద్రంగా క్యాబినెట్ సమావేశంలో ఆమోదించి, కొత్త సంవత్సరం (2026) మొదలు నుండి మార్కాపురం జిల్లా నుండి పరిపాలన కార్యక్రమాలు జరిగేలా ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విశేషంగా కీర్తించారు. నాయకులు, కార్యకర్తల సంతోషాల మధ్య ఎరిక్షన్ బాబు బాణా సంచా పేలుస్తూ సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. ఇక నుండి చంద్రబాబు చేతుల మీదుగా మార్కాపురం జిల్లా అంతటా అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎరిక్షన్ బాబు ఘంటాపదంగా చెప్పారు. ఈ సంవత్సరంలోనే వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి అయ్యి రైతులకు సాగు నీరు అంది వారితో పాటు కూలీలు ఆనందంగా ఉంటారని, అదే విధంగా చంద్రబాబు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తారని, యువతకు ఉద్యోగాలు వస్తాయని, మార్కాపురం జిల్లా అంతటా సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల కన్వీనర్లు షేక్ మాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల కోటయ్య, సత్యనారాయణ గౌడ్, రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపిటిసి ఎల్లయ్య, షేక్ మస్తాన్ వలి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 30)

ఒంగోలు కేశవస్వామి పేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం, కొండమీద శ్రీగిరి దేవస్థానం నందు వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి వారికి విశేష పూజలు చేపట్టి, శ్రీగిరిలో వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేషంగా తరలి వచ్చి ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించిన అనంతరం విష్ణుమూర్తిని దర్శించుకున్నారు. ముక్కోటి రోజున వైకుంఠం ద్వారా స్వామివారిని దర్శించుకుంటే మోక్షప్రాప్తి కలుగుతుందనే ఆకాంక్షతో భక్తులు ఉత్తర ద్వారా దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. ఆలయానికి పోటెత్తిన భక్తులతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేయగా, చెన్నకేశవ ఆలయ లో ఈవో రావెళ్ల శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.





